
సాక్షి
బాపట్ల
శుక్రవారం : 23 : ఆగస్టు : 2024



యల్లమ్మ తల్లి కొలుపులు

వెల్దుర్తి: గుండ్లపాడు గ్రామంలోని యల్లమ్మ తల్లి కొలుపులలో భాగంగా గురువారం బుట్ట బంగారం మట్టిని తీసుకొచ్చారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 589.00 అడుగుల వద్ద ఉంది.కుడి కాలువకు 8,280 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పాతనందాయపాలెం(కర్లపాలెం): గ్రామంలోని కుంచాలవారి ఇలవేల్పు శ్రీ పెద అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం విఘ్నేశ్వరుడు, పోతురాజు, నాగదేవత విగ్రహాలనూ ప్రతిష్ఠించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



కర్లపాలెం: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తవ్వి తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు గురువారం ఆయన కర్లపాలెం మండలంలో పర్యటించారు. గతంలో ఇసుక తవ్విన ప్రదేశాలైన చింతాయపాలెం, బోలాయపాలెం, నల్లమోతువారిపాలెం, నర్రావారిపాలెం, దమ్మనవారిపాలెం, దుండివారిపాలెం గ్రామాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా విఠలేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. గ్రామాలలో అక్రమంగా ఇసుక తవ్వి విక్రయించేందుకు అనుమతులు లేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరత్నం, సెబ్ సీఐ వెంకటేశ్వరరావు, కర్లపాలెం ఇన్‌చార్జి ఎస్‌ఐ స్వామి శ్రీనివాస్, వీఆర్వో పోతురాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి పూజలు

అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో గురువారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్ల సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నిదానంపాటి అమ్మవారి హుండీ ఆదాయం రూ.16 లక్షలు



దుర్గి: అడిగొప్పలలోని నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 16,91,790 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సైదమ్మ బాయి, వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి పప్పుల కృష్ణంరాజు ఆధ్వర్యంలో 30 రోజులపాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందనలు

నరసరావుపేట: ఇటీవల వినుకొండ బొల్లాపల్లి ప్రాంతంలో వైఎస్సార్ సీపీ నాయకుడి కిడ్నాప్ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవటం ప్రతిభ చూపించిన ఇరువురు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బొల్లాపల్లి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న షేక్ నిజాముద్దీన్, బి.తిరుపతిలకు షీల్డు అందజేశారు.

విజయకీలాద్రిపై తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై తిరునక్షత్ర మహోత్సవాల్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళా శాసనాలతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఉదయం 9 గంటలకు పెద్ద జీయర్‌స్వామికి అభిషేకం (తిరుమంజనం), 10:30 గంటలకు అష్టోత్తర శతనామార్చన చేశామని పేర్కొన్నారు.

వైద్యుల భద్రత.. సామాజిక బాధ్యత

- అందరూ అండగా నిలవాల్సిన తరుణమిది
- కోల్‌కతా ఘటనతో మహిళా వైద్యుల్లో తీవ్ర భయాందోళనలు
- ఆస్పత్రుల్లో పోలీసు బందోబస్తు పెంచాలని డిమాండ్
- సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తేనే ఊరట
- ప్రాంగణంలో సీసీ కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణకు వినతి
- రోగుల సహాయకులుగా ఒక్కరికే అనుమతివ్వాలని విజ్ఞప్తి
- 'సాక్షి'తో పలువురు మహిళా వైద్యుల మనోగతం

భగవంతుడు అన్నిచోట్లా ఉండలేక తల్లిని సృష్టించాడని అంటారు. అంతటి మాతృమూర్తి కూడా తన సంతానానికి ప్రేమ మాత్రమే పంచిపెడుతుంది. అవసరమైతే సేవలు చేస్తుంది. బాధలో ఉంటే ఓదారుస్తుంది. కానీ, ఎప్పుడైనా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు వారి ప్రాణాలు కాపాడాలంటే వైద్యులు, వైద్య సిబ్బంది సేవలే కీలకం. అంతటి అమ్మ ప్రేమను కూడా దాటి వైద్యుల సేవకు గుర్తింపు ఉంది. భగవంతుడి ప్రతిరూపం వైద్యులని కూడా చెబుతుంటారు. అలాంటి వారికే నేడు రక్షణ లేకుండా పోవడంపై ఆయా వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి మరీ వారు సేవలు అందించారు. సాధారణ సమయాల్లోనూ పని ఒత్తిడి ఎక్కువైనా చిరునవ్వుతోనే వైద్యం అందిస్తున్నారు. కానీ, కొందరు రోగులు, వారి సహాయకులు వ్యవహరిస్తున్న తీరుతో వైద్యులు, వైద్యసిబ్బంది తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోల్‌కతాలో జరిగిన దారుణ ఘటన నేపథ్యంలో భద్రత కోసం డిమాండ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్పత్రుల్లో ఇతరుల రాకపోకలు పెరగడం వారిని ముఖ్యంగా మహిళా వైద్యులు, సిబ్బందిని తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. మద్యం, గంజాయి వంటివి తాగి వచ్చేవారితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల జిల్లా ఆస్పత్రిలో 'సాక్షి' పరిశీలించినప్పుడు కొన్ని భద్రతా పరమైన లోటుపాట్లు కనిపించాయి. ఈ సందర్భంగా కొందరు మహిళా వైద్యులు తమ అభిప్రాయాలను, డిమాండ్లను కూడా పంచుకున్నారు.

సాక్షి విజిట్



బాపట్ల ఏరియా ఆసుపత్రి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కోల్‌కతాలోని ఆస్పత్రిలో వైద్యవిద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. అత్యంత దారుణంగా ఆమె ప్రాణాలు తీసిన తీరు అందర్నీ కలచివేసింది. మానవత్వానికే మాయని మచ్చగా మిగిలింది. అందరూ ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. ఈ ఘటన మన జిల్లాలోని వైద్యులు, వైద్య సిబ్బందిలోనూ ఆందోళన రేకెత్తించింది. ప్రధానంగా భద్రతకు సంబంధించిన లోపాలను ఈ ఘటన తేటతెల్లం చేసింది.

భద్రత పెంపు అవసరం

ప్రస్తుతమున్న సెక్యూరిటీ వ్యవస్థ అంత సమర్థంగా లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వారికి రక్షణ లేదని చెప్పారు. ఇందుకోసం సీసీ కెమెరాల ఏర్పాటు, పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

రోగుల సహాయకులను నియంత్రించాలి

రోగులకు చికిత్స అందించే విషయంలో వైద్యులకు పలు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా రోగుల సహాయకుల నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రిపూట మద్యం, గంజాయి తాగి అపరిమితంగా వస్తున్న రోగుల సహాయకుల వల్ల తీవ్ర అసౌకర్యంగా ఉందని పలువురు వైద్యులు 'సాక్షి'కి తెలిపారు. అలాంటి సమయంలో అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రోటోకాల్ కారణంగా వైద్యసేవలు అందించడం చాలా సందర్భాల్లో ఆలస్యమవుతోంది. ఆ సమయంలో రోగుల సహాయకులు వైద్యులు, సిబ్బందిని దూషిస్తున్న సందర్భాలు కోకొల్లలు. దురదృష్టవశాత్తూ రోగి మృతి చెందితే వారిపై ఏకంగా దాడులు కూడా జరుగుతున్నాయి.

సీసీ కెమెరాలతో నిఘా కీలకం

బాపట్ల జిల్లాలో వైద్యులతోపాటు వైద్య సిబ్బందిలో 90 శాతం మంది మహిళలే ఉన్నారు. వైద్యుల డ్యూటీ నిబంధనల ప్రకారం 32 గంటలు ఉంటుంది. ఈ మధ్య కాలంలో షిఫ్టులు వేస్తున్నా ఆదివారం పూర్తిగా ఒకరే పనిచేయాల్సి వస్తోంది. రాత్రిపూట విధులు తప్పనిసరిగా మారాయి. ఆ సమయంలో మహిళా వైద్యులకు ఒక మహిళా సిబ్బంది, స్వీపర్‌నో సహాయంగా ఉంచుతున్నారు. చాలావరకు ఆస్పత్రులు ఊరికి దూరంగా ఉంటున్నాయి. కొన్ని చోట్ల జనసంచారం కూడా ఉండదు. అక్కడ జూనియర్ మహిళా డాక్టర్లు పనిచేయడం అత్యంత ప్రమాదకరంగా మారింది. సెక్యూరిటీ లేదు. చాలా పీహెచ్‌సీలలో సీసీ కెమెరాలు లేవు. కొన్నిచోట్ల ఉన్నా పర్యవేక్షణ కొరవడి అవి పనిచేయడం లేదు. అన్ని వైద్యశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వైద్యులు, సిబ్బంది కోరుతున్నారు. పోలీసు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. రోగుల సహాయకులుగా ఒక్కరినే అనుమతించాలని సూచించారు. అన్ని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రుల్లో సమూల మార్పులు అవసరం

– డాక్టర్ విజయమ్మ, డీఎంహెచ్‌వో



పేదలకు వైద్యసేవలు సక్రమంగా అందాలంటే ప్రభుత్వ ఆస్పత్రులలో మరిన్ని మౌలిక వసతుల అవసరం ఉంది. డాక్టర్ల డ్యూటీల సమయం అధికంగా ఉంటోంది. ఒక్కో వైద్యుడు 36 గంటలపాటు పని చేయాల్సి ఉంటోంది. మహిళా వైద్యులు, సిబ్బందికి సైతం రాత్రి డ్యూటీలు ఉంటాయి. దీనివల్ల కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీసీ కెమెరాలు పెట్టినా చాలా చోట్ల అవి సక్రమంగా పని చేయడం లేదు. పైగా వాటి పర్యవేక్షణ సరిగా లేదు. సెక్యూరిటీ పరంగా సమస్యలు ఉన్నాయి. రాత్రి వేళ ఒక ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌తోపాటు మహిళా నర్సు లేదా స్వీపర్ తోడు ఉంటారు. వైద్యశాలలు చాలా వరకు జన సంచారానికి దూరంగా ఉంటున్నాయి. దీనివల్ల రక్షణపరంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. రోగుల సహాయకులతో సమస్య తీవ్రంగా ఉంటోంది. రాత్రి పూట వచ్చే సహాయకులు చాలావరకు మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు తాగి వస్తున్నారు. ఒక్కరు రావాల్సి ఉండగా.. అంతకంటే ఎక్కువగా, ఒక్కోసారి పదుల సంఖ్యలోనూ వస్తున్నారు. ఇలాంటి వారు వైద్యులు, సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారు. మేం రోగానికి మాత్రమే వైద్యం చేయగలం. అది అందరూ అర్థం చేసుకోవాలి. ఏదైనా జరిగితే డాక్టర్లను బాధ్యులను చేయడం సరికాదు. అందుకే పోలీసులను రాత్రిపూట గస్తీ పెట్టాలని కోరాం. ఎంత చేసినా ఊరు బయట ఆస్పత్రులు ఉన్నప్పుడు భద్రతా సమస్య అధికంగా ఉంటోంది. వసతుల కొరత, ఇతర సమస్యలూ ఉన్నాయి. కాస్త ప్రజలు నివాసం ఉండే ఏరియాలో ఆసుపత్రులు నిర్మించాలి. డంపింగ్ యార్డు తరహాలో ఆస్పత్రులు ఊరి బయట నిర్మించడం సరి కాదు.

నిందితులకు కఠిన శిక్షలు విధించాలి



కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన యావత్ భారతదేశాన్ని తలదించుకునేలా చేసింది. నిత్యం మహిళా వైద్యులపై ఏదో ఒక ప్రాంతంలో దాడులు జరుగుతుండటం బాధాకరం. వీటిని అరికట్టడంతోపాటు ఇప్పటికే దాడులకు పాల్పడిన ఘటనల్లో నిందితులను కఠినంగా శిక్షించాలి. అందుకు అనుగుణంగా చట్టాల్లో అవసరమైన మార్పులు చేయాలి. పటిష్ఠంగా అమలు చేయడానికి తగిన వ్యవస్థలను రూపొందించాలి. ప్రస్తుతం మారుమూల, ఏజెన్సీ ప్రాంతాలు, పల్లెటూళ్లలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులకు మనోధైర్యం నింపేలా చట్టాలను కఠినతరం చేయాలి. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సేవలు అందిస్తున్న డాక్టర్‌లకు రక్షణగా అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలి. అక్కడ నైట్ వాచ్‌మెన్‌లను తగిన సంఖ్యలో వెంటనే నియమించాలి. దీంతోపాటు ఆ ప్రాంతంలో నిరంతరం పోలీసు గస్తీ ఉండేలా చూడాలి. సాధ్యమైనన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని నిత్యం పర్యవేక్షించాలి. అవసరమైనప్పుడు వెంటనే స్పందించే ఏర్పాట్లు చేయాలి.

– డాక్టర్ గణచైన్య,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నగరం,
రేపల్లె నియోజకవర్గం

సామాజిక అవగాహన పెంపు ముఖ్యం



రోగుల ప్రాణాలు కాపాడాలన్న సదుద్దేశంతో సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బందికి దాడుల నుంచి భద్రత లభించాలి. దీనికి సామాజిక అవగాహన అవసరం. ఆడ, మగ పిల్లలకు చిన్నతనం నుంచి బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లతో పాటు సెక్స్ ఎడ్యుకేషన్‌ను అందించాలి. అప్పుడు అత్యాచారాలు అరికట్టడానికి కొంత అవకాశం ఉంటుంది. వైద్య వృత్తిలో రోగి ప్రాణం పోయేలా ఎవరూ వ్యవహరించరు. అనివార్య పరిస్థితుల్లో రోగులు మరణిస్తే దాడులకు తెగబడటం సమంజసం కాదు. ఈ దాడులను అరికట్టడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేయాలి. తక్షణం స్పందించేలా చర్యలు చేపట్టాలి. అనుచితంగా ప్రవర్తిస్తే చట్టపరంగా నిందితులకు పడే శిక్షలు తదితరాలకు సంబంధించిన వివరాలతో ఆస్పత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలి.

– వడ్లమూడి కావ్యతేజ, వైద్యాధికారిణి, కొల్లూరు పీహెచ్‌సీ

సహాయకుల తీరుతోనే ఇబ్బంది



రోగులతోపాటు వచ్చే సహాయకులు చాలామంది మద్యం, గంజాయి మత్తులో ఉంటున్నారు. నానా హడావుడి చేయడంతోపాటు ప్రవర్తన సరిగ్గా లేకపోవడం వల్ల రోగులకు సేవలు అందించడం మరింత ఇబ్బందిగా మారుతోంది. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించడం లేదు. విసుగు చెంది అవుట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రోగులతోపాటు ఒక్కరు మాత్రమే సహాయకులుగా రావాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇది మాకు సెక్యూరిటీ పరంగా ఆందోళన పెంచుతోంది. దీనికి అడ్డకట్ట వేస్తే రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చు. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు పెట్టడంతోపాటు సెక్యూరిటీ పటిష్ఠంగా ఉండేలా చూడాలి.

– డాక్టర్ పి.రూపాప్రియాంక, ఏరియా వైద్యశాల, బాపట్ల

పోలీసులు పట్టించుకోవడం లేదు



రోగుల సహాయకుల పేరుతో వచ్చే ఆకతాయిలతో తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. మద్యం, ఇతర మత్తుపదార్థాలు తాగి వచ్చేవారి వల్ల ఇబ్బంది పడుతున్నాం. వారి తీరు సరిగ్గా ఉండడం లేదు. అవుట్ పోస్టు పోలీసులకు చెబితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని అంటున్నారు. డాక్టర్లుగా రోగులకు వైద్యం చేయడానికి మాత్రమే వచ్చాం. రోగుల సహాయకులపై ఫిర్యాదులు చేసి కేసులు పెట్టడానికి మేం రాలేదు. చాలా సందర్భాల్లో అవుట్ పోస్టు పోలీసులు సరిగ్గా స్పందించడం లేదు. మాకు వైద్యం చేయడం చాలా కష్టంగా ఉంటోంది. సెక్యూరిటీ పరంగా ఇబ్బంది పడుతున్నాం.

– డాక్టర్ ఎ.రత్నాంజలి, ఏరియా వైద్యశాల, బాపట్ల

'ఇసుక' సమస్యలన్నీ పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఉచిత ఇసుక విధానంలో అన్ని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఇసుక కావలసిన ప్రజలు గ్రామ సచివాలయాలకు వెళ్లి కూలీ, రవాణా చార్జీలు చెల్లిస్తే చాలని ఆయన చెప్పారు. ప్రజలందరికీ ఇసుక అందుబాటులో ఉంచుతామన్నారు. ఫిర్యాదులుంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 4256032కు కాల్ చేయవచ్చన్నారు. జిల్లాలో ఇసుక తరలించే 300 వాహనాలకు ఆన్‌లైన్‌లో యూనిక్ ఐడీ నెంబర్ కేటాయించి రవాణాకు అనుమతిస్తామని చెప్పారు. వాహనాన్ని బట్టి ధరలు ఉంటాయన్నారు. కొరిశపాడు మండలం అనుమనమూరులో 1,767, అద్దంకి మండలం తిమ్మాయపాలెం - 4,971, మార్టూరు - 630.45 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. అక్టోబరు 15 నుంచి జిల్లాలోని ఐదు ఇసుక రేవులు ప్రారంభిస్తామన్నారు. ఇసుక లభ్యతను బట్టి ఆరు నియోజకవర్గ కేంద్రాలలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గుంటూరు జిల్లాలోని కొల్లిపర, మున్నంగి, గుండి మేడ, తల్లాయపాలెం, లింగాయపాలెం రేవుల వద్ద ఇసుక అత్యధికంగా ఉందని ప్రజలకు చెప్పారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జేసీ బి.సుబ్బారావు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, మైన్స్ ఏడీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతి కీలకం

పొదుపు సంఘాలలోని మహిళల ఆర్థిక అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పీఎంఈజీపీ పథకం అమలు తీరుపై డీఆర్‌డీఏ, బ్యాంక్ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. పథకం కింద 394 యూనిట్ల స్థాపన లక్ష్యంగా కాగా.. సాధనకు బ్యాంక్ అధికారులు రుణాలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. వంద రోజులలో 1,961 సంఘాలకు రూ.1,961 లక్షల రుణాలు ఇవ్వాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ వై. పిచ్చిరెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి వై.రామకృష్ణ, ఎల్‌డీఎం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను జయప్రదం చేయాలి

గ్రామసభలు జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. గ్రామ సభలు ఈ నెల 23వ తేదీన అన్ని మండలాలలో జరపాలని ఆదేశించారు. ప్రజావసరాలపై చర్చ నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా భూమి ధరల పెంపుపై ప్రతిపాదనలు పంపాలని సూచించారు. దేవదాయ భూములపై యాజమాన్య హక్కుల కల్పనకు దస్త్రాల పరిశీలన చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



మనసులో 'నాటు'కునేలా...

చుండూరు (కొల్లూరు): విద్యార్థులు పొలం బాట పట్టారు. దేశానికి వెన్నెముకగా నిలిచే వ్యవసాయ రంగంపై అవగాహన పెంచుకోవడానికి వారందరూ రంగంలోకి దిగారు. ఇంకేం వారి మనసులో సాగు పద్ధతులు తదితరాల గురించి 'నాటు'కునేలా ఉపాధ్యాయులు ప్రాక్టికల్‌గా వివరించారు. ఆడుతూపాడుతూ నాట్లు వేసి పలు విషయాలు తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంపై విద్యార్థులకు అవగాహన అవసరమని యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు చెప్పారు. గురువారం పాఠశాలలోని 9, 10, ఇంటర్ విద్యార్థులకు సాగు పనులపై అవగాహన కల్పించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పొలంలో వరి నాట్లు వేసే తీరుపై అవగాహన కల్పించారు. పాఠశాలలో అగ్రికల్చర్ ట్రేడ్ (ఒకేషనల్) కోర్సు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు సంబంధిత పనులపై ట్రైనర్ పి.జాన్‌వెస్లీ అవగాహన కల్పించారు. విద్యార్థులు పొలంలోకి దిగి స్వయంగా నాట్లు వేశారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు కృషి



అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

బాపట్ల: అందరికి సురక్షిత తాగునీరు అందించడమే జల జీవన్ మిషన్ లక్ష్యమని జిల్లా కో ఆర్డినేటర్ రంగారావు పేర్కొన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లి గ్రామంలో జలజీవన్ మిషన్, డయేరియాలపై గురువారం జిల్లా పరిషత్ హైస్కూలు నుంచి ప్రదర్శన చేపట్టారు. కో ఆర్డినేటర్ రంగారావు మాట్లాడుతూ.. ప్రజలందరు సురక్షిత తాగునీటినే వినియోగించాలని కోరారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయకుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరిబాబు, ఏఎన్ఎం శేషుకుమారి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల సిబ్బందిపై శాశ్వత వేటు

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ ప్రకటన
- ప్రకృతి సాగు మహిళా ఉద్యోగుల హర్షం

సాక్షి ఎఫెక్ట్

మార్టూరు: ఆ మహిళలు తమకు నిత్యం జరుగుతున్న అవమానాలను దిగమింగుకున్నారు.. ఇన్నాళ్లు మౌనంగా భరిస్తూనే జీవన పోరాటం సాగించారు... వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక ఇటీవల మౌనం వీడారు.. ఆత్మాభిమానాలతో ఆడుకుంటున్న వ్యక్తిపై ఎట్టకేలకు విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) బాపట్ల జిల్లా పర్చూరు డివిజన్‌లో మాస్టర్ ట్రైనర్‌గా పనిచేస్తున్న సీహెచ్ అప్పారావును విధుల నుంచి బర్తరఫ్ చేస్తున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల జీవితాలతో ఆడుకుంటూ పైశాచికానందాన్ని పొందుతున్నాడనే ఆరోపణలు ఆయనపై రావడంతో ఈ చర్యలు చేపట్టారు. అప్పారావుతోపాటు ఓ మహిళా సిబ్బంది ఆత్మహత్యాయత్నానికి కారకుడయ్యాడనే ఆరోపణలతో పర్చూరు మండలం ఏదుబాడు యూనిట్లో ఎల్–3గా విధులు నిర్వహిస్తున్న వంకాయలపాటి చెంచయ్యను సైతం విధుల నుంచి బర్తరఫ్ చేస్తున్నట్లు వాణిశ్రీ తెలిపారు. 'ప్రకృతి వనంలో వేధింపుల చీడ' పేరుతో ఈ నెల 21వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం సంచలనం రేపింది. దీంతో ఏపీసీఎన్ఎఫ్ రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్‌కుమార్ ఆదేశాలతో జిల్లా వ్యవసాయ అధికారి గురువారం పై ఇద్దరిపై విచారణ చేపట్టారు. ఆరోపణలు వాస్తవమని తేలడంతో వారిని బర్తరఫ్ చేసినట్లు డీపీఎం తెలిపారు. ఈ విషయమై సీఈవో విజయ్‌కుమార్‌కు, జిల్లా అధికారులు, డీపీఎం వాణిశ్రీ., పర్చూరు ఏడీఏ మోహన్‌రావులకు మహిళా సిబ్బంది ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా కరీముల్లా



పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ నూతన కార్యదర్శిగా ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కరీముల్లా ఎంపిక అయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు అందజేశారు. 28 సంవత్సరాలుగా నిజాంపట్నం, పెదపులివర్రు, చింతాయపాలెం, చందోలు, బెల్లంకొండ, అమర్తలూరు, మాచవరం, ఖాజీపాలెం ఉన్నత పాఠశాలల్లో ఎంతోమంది విద్యార్థులను ఆయన తీర్చిదిద్దారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేలా కృషిచేశారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన వ్యాయామ అక్షరాస్యతలో పాల్గొని 6,7,8 తరగతుల పాఠ్యాంశాలను రచించారు. ఆయన ప్రతిభ, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా ఎంపిక చేశామని అధికారులు తెలిపారు. వాలీబాల్, కబడీ, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్స్‌లో కరీముల్లా శిక్షణ ఇస్తున్నారు. జిల్లాను పాఠశాల క్రీడలలో రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిపేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపతిరావు, తిరుపతిరావు, కత్తి శ్రీను, కృష్ణప్రసాద్, రవిరాజు, దేవరాజు, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ విష్ణు తదితరులు కరీముల్లాను అభినందించారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో వైద్యశాఖ అధికారుల తనిఖీ

ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల పనితీరు, రికార్డుల పరిశీలన

ముస్సాపురం(పెదకూరపాడు): మండలంలోని ముస్సాపురం గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం వైద్యశాఖ జిల్లా అధికారులు గణాంక అధికారి నీలకంఠేశ్వరరావు, డీపీవోజీ పొన్నూరు బాషా, డీపీహెచ్ఎన్‌వో సురేఖ సందర్శించారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీల రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బంది ఏ విధంగా విధులలో అప్‌డేట్‌గా ఉండాలో అవగాహన కల్పించారు. అనంతరం 75 త్యాళ్లూరులోని పీహెచ్‌సీని సందర్శించారు. అక్కడి వైద్యసిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. పనితీరు మెరుగుపరుచుకునేలా సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వెలిగొండారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో విజయ్‌కుమార్, అధికారులు దుర్గ, దిలీప్‌కుమార్, బి.శ్రీనివాసరావు, సుభాషిణి పాల్గొన్నారు.

అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా

- ట్రాక్టర్ సీజ్ చేసిన ప్రత్యేక బృంద సభ్యులు
- ఇసుక తరలిస్తున్న మరో ట్రాక్టర్ పట్టివేత

కొల్లూరు: ఇసుక అక్రమ రవాణాదారుల వ్యవహారం రోజురోజుకు శ్రుతి మించిపోతోంది. వీరి ఆగడాలను నియంత్రించేందుకు నియమించిన ప్రభుత్వ యంత్రాంగంతో కూడిన బృందాలు సైతం భయభ్రాంతులకు గురయ్యేలా వారు బరితెగించి వ్యవహరిస్తున్నారు. మండలంలోని పెసర్లంక, గాజుల్లంక, ఈపూరు పాలిమేర డొంక ప్రాంతాలలో నదిలో ఇసుక తవ్వకాలను అడ్డగోలుగా సాగిస్తున్నారు. పెసర్లంక నక్కపాయ గండి ప్రాంతంలో పంట పొలాల్లోని ఇసుకను లక్ష్యంగా చేసుకున్నారు. బుధవారం రాత్రి మండలంలోని పెసర్లంక అరవింద వారధి సమీపాన గండి ఎగువ ప్రాంతంలోనున్న కృష్ణా నదిలో పంట పొలాల కింద ఇసుక తవ్వి, అక్రమంగా తరలించేందుకు యత్నించారు. సుమారు 20 ట్రాక్టర్లను నదిలోకి దింపారు. భారీ సంఖ్యలో వాహనాలలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు రెవెన్యూ, పోలీసు, సచివాలయ సిబ్బందికి సమాచారం అందడంతో ట్రాక్టర్లను అడ్డగించి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. దీన్ని పసిగట్టిన వాహనదారులు ట్రాక్టర్లు సహా తప్పించుకొని పరారవుతుండగా, నది ఒడ్డున ఒక ఇసుక ట్రాక్టర్‌ను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. తర్వాత పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈపూరు సమీపంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను కూడా బృందాల వారు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టుకు హాజరుపరచనుండగా, ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు బదిలీ చేయనున్నట్లు ఏఎస్‌ఐ అర్జున్ తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

గుంటూరు రేంజ్‌లో మరో 13 మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
గన్నవరపు శ్రీనివాసరావు	పీటీసీ, ఒంగోలు	ప్రత్తిపాడు సర్కిల్, గుంటూరు జిల్లా
షేక్.నాగూర్‌మీరాసాహెబ్	ఇంటెలిజెన్స్	మేడికొండూరు పీఎస్, గుంటూరు జిల్లా
ఇ.నారాయణ	ఇంటెలిజెన్స్	దిశ-1, గుంటూరు జిల్లా
బి.బ్రహ్మయ్య	రేంజ్ వీఆర్, గుంటూరు	సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
ఎం.హైమారావు	రేంజ్ వీఆర్, గుంటూరు	నరసరావుపేట 2 టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
ఆర్.సురేష్‌బాబు	ఎస్సీ, ఎస్టీ సెల్-1, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా	రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల జిల్లా
పీవీ ఆంజనేయులు	రేంజ్ వీఆర్, గుంటూరు	వేమూరు సర్కిల్, బాపట్ల జిల్లా
బి.నాగభూషణం	రేంజ్ వీఆర్, గుంటూరు	చీరాల 2 టౌన్ పీఎస్, బాపట్ల జిల్లా
షేక్.ఖాజావలి	మహిళా పీఎస్, ప్రకాశం జిల్లా	కనిగిరి సర్కిల్, ప్రకాశం జిల్లా
సీహెచ్.ప్రభాకర్‌రావు	రేంజ్ వీఆర్, గుంటూరు	ఎర్రగొండపాలెం సర్కిల్, ప్రకాశం జిల్లా
ఆర్ఎస్.కిషోర్‌కుమార్	మెరైన్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా 5 టౌన్ పీఎస్
బి.పాపారావు	రేంజ్ వీఆర్, గుంటూరు	కావలి రూరల్ సర్కిల్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
జె.శ్రీనివాస్	రేంజ్ వీఆర్, గుంటూరు	గూడూరు 2 టౌన్ పీఎస్, తిరుపతి జిల్లా

లారీ ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు

దాచేపల్లి: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. దాచేపల్లి సమీపంలోని భవ్య పెట్రోల్ బంకు వద్ద జరిగిన ఈ ఘటనలో పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కొండ్రు కోటయ్య, కోటేశ్వరిల పెద్ద కుమారుడు రామ్‌చరణ్ అలియాస్ సీమోను (17) మృత్యువాత పడ్డాడు. అదే గ్రామానికి చెందిన చిన్న వెంకయ్య, ఉదయ్ గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం బ్రాహ్మణపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై సీమోను, చిన్న వెంకయ్య, ఉదయ్ వ్యక్తిగత పనుల నిమిత్తం దాచేపల్లి వస్తున్నారు. భవ్య పెట్రోల్ బంకు సమీపంలో ముందు వెళుతున్న లారీని దాటే క్రమంలో లారీ రోడ్డుమార్జిన్ వైపుగా దూసుకురావటంతో ద్విచక్ర వాహనం పక్కకి తప్పిస్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రామ్‌చరణ్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. చిన్న వెంకయ్య, ఉదయ్‌కి గాయాలు కావడంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి కోటయ్య ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. రామ్‌చరణ్ కూలీ పనులు చేసుకుంటూ తల్లికి చేదోడుగా ఉంటూ కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఘటన స్థలాన్ని ఎస్‌ఐ జి.సంధ్యారాణి పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలు



చిలకలూరిపేట: ఏపీ స్టేట్ శ్రీగిరిరాజు కృష్ణమూర్తి మెమోరియల్ సెకండ్ ర్యాంకింగ్ క్యారమ్స్ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 24, 25 తేదీలలో చిలకలూరిపేటలోని సీఆర్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ తెలిపారు. ఏపీ స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఆర్ క్లబ్ ప్రాంగణంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలకు క్యారమ్స్ క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. పోటీలు పురుషులు, స్త్రీల విభాగంలో విడివిడిగా కొనసాగుతాయన్నారు. జాతీయస్థాయి క్యారమ్స్ క్రీడాకారులైన జనార్ధన్‌రెడ్డి, వైఎస్‌డీ రమేష్, ఎంఎస్‌కే హారిక, గిన్నిస్‌బుక్ రికార్డు హోల్డర్ ఎస్‌కే హుస్నా సమీర వంటి మేటి క్రీడాకారులతో పాటు మొత్తం 160 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పోటీలకు చీఫ్ రిఫరీగా డీఎస్ఆర్ మూర్తి, అసిస్టెంట్ చీఫ్ రిఫరీగా ఎండీ సిరాజ్ అహమ్మద్, మరో 8 మంది రిఫరీలుగా వ్యవహరిస్తారన్నారు. పోటీలకు అబ్జర్వర్‌గా జె.మురళీకృష్ణ వ్యవహరిస్తారన్నారు. పురుషుల విభాగంలో నాలుగు బహుమతులు, స్త్రీ విభాగంలో రెండు బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో క్యారమ్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి బోయపాటి రవితేజ, అధ్యక్షుడు చల్లగుండ్ల అజేయ్‌బాబు, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్వీ రమణమూర్తి, సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టరును ఢీకొన్న ఆటో.. ఒకరి మృతి

ఐదుగురికి తీవ్రగాయాలు



మల్లికార్జున మృతదేహం



ధ్వంసమైన వాహనాలు

అద్దంకి: ట్రాక్టర్‌ను ఆటో ఢీకొన్న దుర్ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అద్దంకి-దర్శి రహదారిలోని తిమ్మాయపాలెం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. ముండ్లమూరు మండలంలోని భీమవరం గ్రామం నుంచి ముగ్గురు రైతులు పొగాకు చెక్కలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని వెల్లంపల్లి వెళ్తున్నారు. ట్రాక్టర్ తిమ్మాయపాలెం సమీపంలోకి రాగానే అద్దంకి నుంచి దర్శి వైపు కేటరింగ్ కోసం వెళ్తున్న ఆటో.. డోర్లు విడిచి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దాంతో ట్రాక్టర్ ట్రాలీ ఒక వైపునకు తిరగబడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై కూర్చున్న రైతులు నల్లబోతుల రామకృష్ణ, బుడగలూరి రామారావు, బొట్ల హనుమంతరావులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో నడుపుతున్న నక్కా మల్లికార్జున (37) అక్కడిక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పొన్నం నాగాంజనేయులు, ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు తాటి శ్రీహరికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. మల్లికార్జున తెనాలి మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి అదృశ్యమైన వృద్ధుడు మృతి



పాపారావు మృతదేహం

ఇంకొల్లు (చినగంజాం): ఇంటి నుంచి మూడు రోజుల క్రితం వెళ్లిపోయిన ఓ వృద్ధుడు విగతజీవిగా కనిపించిన ఘటన ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై రమణయ్య వివరాల మేరకు.. దుద్దుకూరు గ్రామానికి చెందిన మల్లెల పాపారావు (75) తన కుమారుడు అంకులుతో కలిసి నివాసం ఉంటున్నారు. పాపారావుకు మతి స్థిమితం లేకపోవడంతోపాటు పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఏడాది క్రితం భార్య చనిపోయింది. ఈ నెల 9వ తేదీన ఉదయం పాపారావు ఇంట్లో భోజనం చేసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడు, బంధువులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. గురువారం ఇంకొల్లు గ్రామంలోని కొణికి రోడ్డులోనున్న భారత్ పెట్రోల్ బంక్ సమీపంలోని బస్ షెల్టర్‌లో పాపారావు విగతజీవిగా కనిపించాడు. ఈ మేరకు స్థానికులు అతని కుమారుడికి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై తమ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. అంకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిని బలిగొన్న బెట్టింగులు

అప్పులపాలై ఉరేసుకుని ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న పవన్‌కుమార్ మృతదేహం

మేదరమెట్ల: బెట్టింగులకు బానిసైన ఓ యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అప్పుల పాలై ఆ బాధలు తట్టుకోలేక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామంలో గురువారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. లింగా పవన్‌కుమార్ (30) కొంతకాలంగా బెట్టింగులకు అలవాటు పడ్డాడు. అప్పులు చేసి మరీ బెట్టింగులకు పాల్పడ్డాడు. గతంలో కూడా ఇలాగే ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొరిశపాడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను విచారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

వీవీఐటీలో 'స్పర్ధ-2కే24' ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్ బండికల్ల



పేర్లు నమోదు చేయించుకుంటున్న విద్యార్థులు

పెదకాకాని: విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ సిర్కానా, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ టీమ్ లీడ్ డాక్టర్ రాజేష్ బండికల్ల అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ(ఏసీఎం) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న స్పర్ధ-2కే24 సాంకేతిక సదస్సును గురువారం డాక్టర్ రాజేష్ బండికల్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు నూతన సాంకేతితను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36 కళాశాలల నుంచి 210 గ్రూపులు, 4278 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొనున్నారన్నారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమములో అల్గో అరేనా, ట్రెజర్ ట్రూపర్, గేమ్ ఆఫ్ కోడ్, రిడిల్ ర్యాం పేజ్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. ఈ సదస్సుకు హాజరైన విద్యార్థులకు అత్యాధునిక వర్చువల్ రియాలిటీ సాంకేతికతతో ఆటలు ఆడించారు. ఈ వేడులలో భాగంగా సాంకేతిక నైపుణ్యాల పెంపుదల, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏసీఎం క్రానికల్ 2024 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఏవీ?

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: రైతు సేవాకేంద్రాల ద్వారా డీఏపీ తదితర ఎరువులను అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటకాల్వలకు పుష్కలంగా నీరు వస్తున్న తరుణంలో రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ ఎరువులు లభ్యంకాక రైతులు ఇబ్బంది పడుతున్నట్లు తెలియజేశారు. ప్రైవేటు వ్యాపారులకు, సొసైటీలకు ఎరువులను కేటాయించిన ప్రభుత్వం, రైతు సేవాకేంద్రాలకు కేటాయింపులు ఇవ్వకపోవటం శోచనీయమన్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు బస్తాకు రూ.50 అదనంగా వసూలుచేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారని శివసాంబిరెడ్డి తెలిపారు. తెనాలి, పరిసర గ్రామాల రైతులు బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు సొసైటీకి వెళ్లి ఎరువులు తెచ్చుకుంటున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని రైతుసేవాకేంద్రాలకు అవసరమైన ఎరువులను కేటాయించాలని విజ్ఞప్తిచేశారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పరిధిలోని అర్హులైన ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ-2024 అవార్డుకు ఈనెల 25వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యంలో పనిచేసే పాఠశాలల ఉపాధ్యాయులు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 15 సంవత్సరాల బోధనానుభవం ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తమ దరఖాస్తులను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈఓకు అందచేయాలని తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులను సెప్టెంబర్ 5వతేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సత్కరించనున్నట్లు వివరించారు.

వినుకొండ కమిషనరుగా సుభాష్ చంద్రబోస్



వినుకొండ(నూజెండ్ల): పట్టణ మున్సిపల్ కమిషనరుగా ఎం.సుభాష్ చంద్రబోస్ నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట కమిషనరుగా ఉన్న ఆయన బదిలీల్లో భాగంగా వినుకొండకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణవేణిని నిడదవోలుకు బదిలీ చేశారు.

ఫార్మా కార్మికుల మృతి బాధాకరం

- బాధిత కుటుంబాలను ఆదుకోవాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



వినుకొండ (నూజెండ్ల): అచ్యుతాపురంలో ఫార్మాకంపెనీలో భారీ పేలుడు సంభవించి 17 మంది కార్మికులు మృతి చెందడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పేలుడు సంఘటనపై యాజమాన్య నిర్లక్ష్యమైతే ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొని మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలు, మహిళా డాక్టర్లపై మానవ మృగాలుగా ప్రవర్తిస్తున్న వారిపై నిర్భయ చట్టం కఠినంగా అమలు చేయాలని, చట్టం ఉన్నప్పటికీ మానవ మృగాలలో ఎటువంటి మార్పు రావడం లేదన్నారు. సినిమాల్లో, టీవీల్లో అశ్లీల దృశ్యాలు నియంత్రించాలన్నారు. తల్లికి, చెల్లికి వందనం అనే అంశంపై పాఠ్యాంశాల్లో గౌరవం కల్పించే విధంగా చేయాలన్నారు. వికృత సంస్కృతిపై పోలీస్ వ్యవస్థ ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భూ బాధితుల సమస్యలపై ఈ నెల 28న విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయీం బదిలీ

నూతన కమిషనర్‌గా రమేష్‌బాబు

పొన్నూరు: పొన్నూరు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌ను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయమని గురువారం డీఎంఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో కమిషనర్‌గా శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రమేష్‌బాబు పొన్నూరుకు రానున్నారు.

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

- గుంటూరు డీవైఈఓ వెంకటేశ్వరరావు
- ఇన్‌స్పైర్ మనక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సన్నద్ధతపై పరీక్షా భవన్‌లో ఓరియెంటేషన్



ఓరియెంటేషన్‌కు హాజరైన ఉపాధ్యాయులతో రీసోర్స్ పర్సన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ఇన్‌స్పైర్ చేసి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు అన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్ష భవన్‌లో గురువారం ఇన్‌స్పైర్ మానక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సన్నద్ధతపై ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లాస్థాయిలో ఓరియెంటేషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మానక్‌ను వేదికగా చేసుకుని అన్వేషణాత్మక ఆలోచనలు కలిగిన విద్యార్థులను శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆరు నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థుల చిట్టిబుర్రల్లో గట్టి ఆలోచనలు ఉంటాయని, వాటికి పదును పెట్టడం ద్వారా బాల శాస్త్రవేత్తలు తయారవుతారన్నారు. గుంటూరు జిల్లాలోని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్లు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ఈసందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 10 ఏళ్లపాటు సైన్స్ అధికారిగా సేవలందించిన మధుకుమార్‌ను సైన్స్ ఉపాధ్యాయులు సన్మానించారు. ఆర్.శివనాగేశ్వరరావు, అప్పారావు, శివశంకర్, మల్లిఖార్జునరావు, గంగాధర్, జాకీర్ హుస్సేన్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించగా, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పల్నాడు జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, ఎంఈఓ బీవీ రమణయ్య, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31 నుంచి పికిల్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలు



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ స్టేట్ పికిల్ బాల్ అసోసియేషన్, వీవీవీ హెల్త్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఏపీ స్టేట్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి టి.అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని హనుమాన్ నగర్ 1వ లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. అండర్-14, 19 బాలుర సింగిల్స్‌తోపాటు 35+, 50+ పురుషుల విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లలో పోటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించామని తెలిపారు.